క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ

చిట్టమూరు: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామమైన బురదగల్లికొత్తపాళెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంపీడీఓ మనోహర్‌గౌడ్, ఏపీఓ షీలు కథనం.. గ్రామానికి చెందిన రైతు శేఖర్(45) తోటి కూలీలతో కలిసి గ్రామానికి సమీపంలో ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా కొంత సేపటికి శేఖర్ ఛాతీలో నొప్పిగా ఉందని సహచర కూలీలకు తెలియజేశాడు. ఆపై కొంత సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ చలనం లేకపోవడంతో మృతిచెందాడని నిర్ధారించుకుని కూలీలు గ్రామానికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

కూల్చేస్తున్నారు సారూ!



కూల్చి వేసిన కట్టడాలు

గూడూరు రూరల్ : పట్టణంలోని సనత్ నగర్ ప్రాంతంలో సర్వే నం.576ఏలోని కట్టడాలను గత నెలలో రెవెన్యూ అధికారులు ఆక్రమణల పేరుతో తొలగించే క్రమంలో కొంత భాగం కూల్చేశారని బాధితులు శ్రీనివాసులు, సుబ్బానాయుడు తెలిపారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. అయినా కొంత మంది వ్యక్తులు మంగళవారం మరో మారు అక్రమంగా తమ స్థలంలోకి ప్రవేశించి జేసీబీలతో మిగిలిన కట్టడాలను కూల్చేందుకు ప్రయత్నించారని తెలిపారు. చివరకు గూడూరు డీఎస్పీ గీతాకుమారి దృష్టికి తీసుకెళ్లడంతో వారిని అడ్డుకున్నారని చెప్పారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

వాకాడు: పూటుగా మద్యం సేవించిన ఓ యువకుడు మంగళవారం మండల కేంద్రమైన వాకాడులోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పైకెక్కి హల్‌చల్ చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బట్టా చిన్ని మద్యం మత్తులో దాదాపు 130 అడుగుల ఎత్తు ఉన్న సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న వాకాడు పోలీసులు, కోట అగ్నిమాపకశాఖ అధికారులు ఆ యువకుడిని చాకచక్యంగా కిందకి దించి స్టేషన్‌కు తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడూరురూరల్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బి.రమేష్, దారా కోటేశ్వరరావు, ఎస్.వెంకటరమణ, మురళీ అంకయ్య, ప్రసాద్, శివకుమార్, బీవీ రమణయ్య పాల్గొన్నారు.

రాజకీయ చట్రంలో సత్యవేడు!

- ఎమ్మెల్యే ఒకరు.. పెత్తనం మరికొందరిది
- నాడు విమర్శలు చేసి.. నేడు చేస్తున్నదేమిటో?
- సత్యవేడులో ఆ సామాజికవర్గం వారే పెత్తందారులు
- సస్పెన్షన్‌తో ఎమ్మెల్యేను పక్కనబెట్టిన టీడీపీ అధిష్టానం
- నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్, ఇసుక దోపిడీ
- మంత్రి లోకేష్ పర్యటనలో సత్యవేడు టీడీపీలో లుకలుకలు



వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం నుంచి తమిళనాడుకు గ్రావెల్ తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గం రాజకీయ చట్రంలో చిక్కుకుంది. స్థానిక ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు గురైనప్పటి నుంచి ఆ నలుగురు నేతలు తామే ఎమ్మెల్యేనంటూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఆ నలుగురు కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ప్రత్యేకం. శ్రీసిటీ ఉండడమే అందుకు నిదర్శనం. ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానం. ప్రస్తుతం ఆదిమూలం ఎమ్మెల్యే. ఎన్నికలముందు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యారు. స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత ఓ మహిళను లైంగికంగా వేధించారని బాధిత మహిళ మీడియా ముందు కొచ్చి చెప్పడంతో ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పెత్తందారుల చేతుల్లోకి సత్యవేడు

ఎమ్మెల్యేని సస్పెండ్ చేయడంతో సత్యవేడు నియోజకవర్గంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నలుగురు రంగప్రవేశం చేశారు. ఎన్నికల ముందు పరిశీలకుడిగా వచ్చిన చంద్రశేఖర్‌నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్, కో-ఆర్డినేటర్ పేరుతో శ్రీపతిబాబు సత్యవేడులో పెత్తనం చెలాయిస్తున్నారు. గంగాప్రసాద్ మాత్రం తెరవెనుక నుంచి రాజకీయం నడిపిస్తుంటారనే ప్రచారం ఉంది. తాజాగా మంత్రి నారా లోకేష్ పర్యటన ఖరారు కావడంతో మరో కమ్మసామాజిక వర్గానికి చెందిన శాప్ చైర్మన్ రవినాయుడు రంగంలోకి దిగారు. ఆ ముగ్గురే అనుకుంటే.. కొత్తగా మరొకరు వచ్చారంటూ నియోజకవర్గంలో కూటమిలో చర్చనీయాంశంగా మారింది.

దళిత నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సస్పెన్షన్‌ని ఆసరాగా చేసుకుని సత్యవేడులో పెత్తందారి వ్యవస్థకు నాంది పలికింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఏదో ఒక అలజడి సృష్టిస్తూ ఎమ్మెల్యేను సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకవర్గం విమర్శనాస్త్రాలను సంధిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారుల పాలన నడుస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలంతో పాటు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు చేశారు. ఆ ప్రచారాలను తన ఎల్లోమీడియా ద్వారా విషప్రచారం చేయించారు. కూటమి నేతలు అదే వ్యక్తిని టీడీపీలోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే అయ్యాక ఆదిమూలం బండారం బట్టబయలు అయ్యింది. వైఎస్సార్‌సీపీ మంచి నిర్ణయమే తీసుకుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. నేడు సత్యవేడు నియోజకవర్గంలో జరుగుతున్నది పూర్తిగా టీడీపీ పెత్తందారుల పెత్తనమే కదా..? అని స్థానికులు అంటున్నారు. అందుకు నిదర్శనమే అక్రమ అనుమతులతో పక్క నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త తన బినామీల ద్వారా పెద్ద ఎత్తున గ్రావెల్, ఇసుక తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేగాక తెర వెనుక ఆయనే పెత్తందారుడిగా వ్యవహరిస్తూ ఆయన చెప్పిన అధికారులనే నియమించుకున్నారు. సీఎం చంద్రబాబు అనుచరుడిగా, వ్యాపారవేత్తగా చలామణీ అవుతూ సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారు. ఇలాంటి వారిపై మంత్రి లోకేష్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



సత్యవేడు: సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవంలో చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతి బాబు (ఫైల్)

తరలిపోతున్న సత్యవేడు సంపద

సార్వత్రిక ఎన్నికల సమయంలో నియోజకవర్గం పరిశీలకుడిగా ప్రవేశించి నేడు సత్యవేడు చంద్రుడుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్న చంద్రశేఖర్ నాయుడు, సూళ్లూరుపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంగాప్రసాద్ అనుచరుడు సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అని చెప్పుకుంటున్న శ్రీపతిబాబు ఎమ్మెల్యే కాకపోయినా ఎమ్మెల్యే హోదాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ హడావుడి చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సంపదగా ఉన్న గ్రావెల్, మట్టి, ఇసుకను తమిళనాడు సరిహద్దులను దాటించి పెద్ద మొత్తంలో లాభార్జన పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమ రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ ఖాతరు చేయడం లేదు.

చచ్చేవరకు జగనన్నతోనే

– స్పష్టం చేసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : నేను బతికున్నంత కాలం జగనన్నతోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్యే రాజకీయాలకు దూరంగా ఉన్నాడంటూ ప్రచారం చేయడంపై ఆయన గట్టిగానే సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కేసులు నమోదవుతున్న నియోజకవర్గంలో శ్రీకాళహస్తిని చెప్పుకోవాలని తెలిపారు. జనసేన, టీడీపీ కొట్టుకుని ఒకరి ఫ్లెక్సీలు ఒకరు చింపుకుంటుంటే దాన్ని వీడియో తీసిన విలేకరిపైన, అతనిని ఇంటి కాడ వదిలేసి వస్తున్న మరో విలేకరిపైన అమానుషంగా దాడులు చేయడం దారుణమన్నారు. రాయలసీమలో కొన్ని ఏరియాల్లో మాత్రమే జరిగే గొడవలను శ్రీకాళహస్తికి తెచ్చేశారన్నారు. పచ్చగా పండిన పైర్లను దున్నేస్తున్నారని, ఇంటి నిర్మాణం కోసం తెచ్చిపెట్టుకున్న విలువైన కలపను తగలబెట్టేస్తున్నారని, అంతా హిట్లర్ పాలన తలపిస్తోందని ధ్వజమెత్తారు. టీడీపీకి సంబంధించిన ఏదో ఒక సోషల్ మీడియాలో ఏదో ఒకటి ప్రచారం చేస్తే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి మొదటి అడుగు వేసే నాటికి తాము ఆయన వెనకాల ఉన్నామని, ఆయన పేరుతో జగన్ చారిటబుల్ ట్రస్ట్ పెట్టి సేవ చేశానని పేర్కొన్నారు. 'నా ప్రాణం ఉన్నంతవరకు జగనన్నతోనే నా ప్రయాణం ఉంటుంది' అని స్పష్టం చేశారు. జగనన్న కోసమే బెంగళూరులో వ్యాపారాలు వదులుకొని శ్రీకాళహస్తి వచ్చి రాజకీయాల్లో ఉన్నట్లు తెలిపారు. కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడం మానేసి కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో మీడియా సోదరులు కూడా స్వతంత్రంగా వార్తలు రాయలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి అరాచకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీకి చెందిన పుదూరు సర్పంచ్ మల్లాపు సుమతి తండ్రి, గిరిజన సంఘ నాయకుడిగా ఉంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించే ఈగ సుబ్రహ్మణ్యం (59) అస్వస్థతకు గురై మృతిచెందాడు. కుప్పరగుంట ఎస్టీ కాలనీకు చెందిన సుబ్రహ్మణ్యం సోమవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స తీసుకుంటుండగా మృతిచెందాడు. విషయం తెలిసి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పార్టీ నాయకులతో కలిసి కుప్పరగుంట గ్రామానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. సుమతిని పరామర్శించారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కిలివేటి

ఆర్టీసీని ఆదరించండి

కోట: కోట నుంచి నెల్లూరుకు ప్రతి అరగంటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసును నడుపుతున్నట్లు వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. మంగళవారం కోటలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీని మరింత చేరువ చేస్తున్నామన్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 8.30 వరకు ప్రతి అరగంటకు కోట నుంచి నెల్లూరుకు బస్సులను నడుపుతున్నామని తెలిపారు. ఇందుకుగాను 8 బస్సులకు కేటాయించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ రఘురామయ్య పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించండి

దొరవారిసత్రం: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు అన్ని వసతులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గం స్థాయిలో పీడీ ఉపాధి అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ ప్రేమ్ కుమార్, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న పీడీ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చిల్లకూరు: బల్లవోలు గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులైన నాగభూషణం కుటుంబానికి మంగళవారం ప్రభుత్వం ద్వారా రూ.5.వేల ఆర్థిక సాయాన్ని చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసుల చేతుల మీదుగా అందించారు. ఉపసర్పంచ్ దువ్వూరు వినయ్‌కుమార్ రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



ఆర్థికసాయాన్ని అందిస్తున్న తహసీల్దార్

విద్యార్థినులకు నగదు పురస్కారాలు

చిల్లకూరు: చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు నలగర్ల రమ్యశ్రీ, గూడూరు భవ్యశ్రీ, ఆదోని చంద్రహాసినిలకు మంగళవారం గూడూరుకు చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్మాష్ షోరూం అధినేత పాణకా మల్లికార్జున రెడ్డి దాతృత్వంతో నగదు పురస్కారాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం మౌలా, సంస్థ అధ్యక్షుడు ఆత్మకూరు సురేష్, సభ్యులు మల్లి, సాయి పాల్గొన్నారు.



పురస్కారాలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

బాల్య వివాహాలను అరికట్టాలి

బాలాయపల్లి(సైదాపురం): బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు సహకరించాలని మహిళా సంరక్షణ కార్యదర్శి అనూశ్రీ అన్నారు. గొట్టికాడు ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం బాల్యావివాహాలు, బాలల హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యకర్త సుమతి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

కిశోరి వికాసంపై అవగాహన

కలువాయి(సైదాపురం): పెరంకొండలో మంగళవారం రాపూరు సీడీపీఓ సునంద ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కోట: కొక్కుపాడు రోడ్డు మలుపు వద్ద మంగళవారం బైక్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. కోటకు చెందిన ఆక్వా రైతు బాబురెడ్డి కొక్కుపాడు వైపు బైక్‌లో వెళుతున్నాడు. అదే సమయంలో ముత్తుకూరు నుంచి కోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా దూసుకురావడంతో బస్సును తప్పించే క్రమంలో బైక్ బోల్తాపడింది. ఈప్రమాదంలో బాబురెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ ఏసుపాదంను విచారిస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కలువాయి మండలంలో..

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని బ్రాహ్మణపల్లి మలుపు వద్ద మంగళవారం బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో కుల్లూరుకు చెందిన వెంకటరమణయ్య గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

ఐదు సెంటర్లలో నేడు ఐసెట్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలలో ఐసెట్-2025 బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలో గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు ఎస్వీ పెరుమాళ్ ఇంజనీరింగ్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జూపార్క్ సమీపంలోని ఐయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో సుమారు 5వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

మస్టర్ల మాయాజాలంపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

కలువాయి (సైదాపురం): నియోజకవర్గ పరిధిలోని కలువాయి మండలం, బాలాజీరావు పేటలో జరిగిన ఉపాధి మస్టర్ల మాయాజాలంపై జిల్లా విజిలెన్స్ అధికారి డీ.విజయలక్ష్మి, ఏపీడీ గాయత్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. సాక్షాత్తు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు సొంత గ్రామంలోనే తూతూమంత్రంగా విచారణ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏపీఓ సునీల్, సిబ్బంది శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.



విచారణ అధికారుల సమక్షంలోనే కూర్చుని ఉన్న టీడీపీ అధ్యక్షులు

జీఓ:36 మేరకు వేతనాలు ఇవ్వాలి

వెంకటగిరి(సైదాపురం): జీఓ:36 మేరకు డ్రైవర్లు, ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిమెంట్ ఫెడరేషన్ సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రెండో రోజు మంగళవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీ రమణ, పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, రమణయ్య, శుభరత్నమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు

వెంకటగిరి రూరల్: 'మా మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దు' అని శ్రీకళ్యాణరామ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ సర్వజ్ఞ యాచేంద్ర మంగళవారం పేర్కొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, సైదాపురం మండలం, శ్రీకల్యాణ రామ కంపెనీకి కలిచేడు, గోగుల బృందావనం గ్రామాల్లో రెండు మైనింగ్ గనులున్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1920-30 నుంచి నేటి వరకు ఆయా మైకా పరిశ్రమల్లో మైకా, క్వార్ట్జ్ ఫెల్డ్‌ఫర్ క్వారీలను మచ్చలేని రికార్డులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమ ఐదో తరం కుటుంబ సభ్యులతో సహా క్వారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ కంపెనీలకు సంబంధించి మైనింగ్ పరిశ్రమను రాజకీయం చేయొద్దని కోరారు.

ఒరిగిన స్తంభాన్ని నిలబెట్టారు

సాక్షి ఎఫెక్ట్..



చిట్టమూరు: అన్నగొల్లపాళెం గ్రామ సమీప పొలాల్లో నేల కొరిగిన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది యథావిధిగా నిలబెట్టారు. సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'కిందకి వాలిన విద్యుత్ స్తంభం' అనే శీర్షికకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ సాయంతో నిలువునా ఉండేలా పనులు చేశారు.

బీమా భరోసా కల్పించాలి

చిల్లకూరు: భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ పథకం కూలీలకు బీమా భరోసా కల్పించేలా క్షేత్ర సహాయకులు చొరవ చూపాలని అసిస్టెంట్ కార్మిక శాఖాధికారి సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఏపీఓ గిరిబాబు పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయండి

గూడూరురూరల్: తిరుపతిలో ఈనెల 8, 9,10 తేదీల్లో జరిగే సీపీఎం బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు జోగి శివకుమార్, పామంజి మణి, బీవీ రమణయ్య, చంద్రయ్య, గుర్రం రమణయ్య, ధనమ్మ, యశోదమ్మ, నరసనమ్మ పాల్గొన్నారు.

పిడుగు పడి తాటి చెట్టు దగ్ధం



సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం, మన్నేముత్తేరి గ్రామంలో మంగళవారం సాయంత్రం తాటి చెట్టుపై పిడుగు పడింది. హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. ఉరుములు, మెరుపులతో పాటు వర్షం రావడంతో స్థానికులు వణికిపోయారు. తీవ్రమైన ఈదురు గాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

కుక్కలదాడిలో దుప్పి మృతి



కోట: దాహార్తి తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడికి తెగబడిన ఘటన మండలంలోని మైక్రోటవర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. కుక్కల భారి నుంచి దుప్పిని గ్రామస్తులు రక్షించారు. ఆపై ఫారెస్ట్ అధికా రులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు వచ్చే సమయానికి దుప్పి మృతి చెందడంతో వారికి అప్పగించారు.

ఖాళీలను భర్తీ చేస్తాం

రాపూరు: ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. రాపూరు ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్‌ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో 3 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. డీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- తిరుపతి కొర్లగుంట ప్రైమ్ లోకేషన్‌లో 125 అంకణాల కమర్షియల్ బిట్ తక్కువ ధరకే. సంప్రదించండి సెల్: 91609 68886, 98486 25575.
- తిరుపతి గంగమ్మ జాతర శుభాకాంక్షలు. తిరుచానూరు to రేణిగుంట రాక ముందే యోగానంద కాలేజీకి ఆనుకొని 40 ఫీట్స్ సీసీ రోడ్స్, UG డ్రైనేజీ, ఎలక్ట్రిసిటీ, TAPS, పార్క్‌తో వెంటనే ఇల్లు, Apartment కట్టుకొనే Tuda అప్రూవల్ గల KVRR HighLands వెంచర్ నందు 100% వాస్తు Plots అమ్మబడును. Call: 95055 02346.

Wanted

- Rankers English High School, Mittoor, Chittoor Required Teachers Fluent in English Pre-Primary/ Primary/High School for all subjects.Apply before 10.05.2025. 9885634546.
- తిరుపతి శ్రీనివాస హోటల్ కపిలతీర్థం వద్ద పనిచేయుటకు టిఫిన్ మాస్టర్లు, క్లీనింగ్ స్టాఫ్, సర్వీస్ స్టాఫ్ కావలెను. సెల్: 70937 35578, 91005 93958.
- తిరుపతి ప్రముఖ Petrol Bunk నందు పనిచేయుటకు Pump Boys కావలెను. ఆకర్షణీయమైన జీతం: 14,000+ Incentive ఇవ్వబడును. సంప్రదించండి సెల్: 90301 44410, 779999 5945.
- మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459.
- వీరభద్ర గ్యాస్ ఏజెన్సీ పుంగనూరు నందు పనిచేయుటకు గోడౌన్ కీపర్ మరియు LPG సిలిండర్ డెలివరీ చేయుటకు త్రీ వీలర్ ఆటో డ్రైవర్లు కావలెను. సొంత ఆటో ఉండి డెలివరీ చేయు వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్ : 9246846892
- శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899
- Need Counsellor (F), Loc : Tirupati, Any Degree, Min 1yr Exp, Good Skills, Call: 8179895913

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 54-20-1B3F/U5, 3వ అంతస్తు, వెళ్లి మేడపేట, సూర్యప్రకాష్ ప్లాజా, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

(Rule 8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, విజయవాడ యొక్క అధీకృత అధికారి ... సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ... [illegible]

తేది : 05-05-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తిరుపతి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SARB, విజయవాడ



కీ.శే.శ్రీ వై.ప్రభాకర్‌రావు గారు
M.Com., BEd., CPE(London) PSTT (UK)
Rtd Deputy CEO ZP (Guntur)
Rtd Ex MPDO - Naidupet
Ex. Ombudsman MGNREGS Nellore Dt
Ex. SEBI - Financial Education resourece Person Nellore (Dt)

11వ వర్ధంతి

ఆదరణ అనుబంధాలకు మారుపేరై ప్రేమానురాగాలను మాకు పంచి, మానవతా విలువలను మాలో పెంచిన మా ఇంటి దైవం
కీ.శే. శ్రీ వై. ప్రభాకర్‌రావు గారు
భౌతికంగా మా నుండి దూరమై 11 సం॥లు గడిచినా వారి జ్ఞాపకాలు మా మదిలో మెదలుతూనే ఉన్నాయి. వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: N. పెంచలమ్మ Rtd లెక్చరర్
Ex Ombudsman MGNREGS NLR (Dt)

కుమారులు - కోడళ్ళు
వై.బాలాజీ కిరణ్ IRTS - ధన అనుపమ M.A, M.Phil
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ (SCR) Asst Professor
వై.మంజీత్ ప్రవీణ్ MS(IT) - డా.శ్రీ రమ్య MBBS DNB, (GYNIC)



కోలాహలం..పోలేరమ్మ జాతర


సారె తీసుకొస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక


గంగపెట్టితో ఊరేగింపుగా వెళుతున్న యాదవులు

నాయుడుపేటటౌన్: స్థానిక గ్రామదేవత పోలేరమ్మ జాతర మంగళవారం కోలాహలంగా జరిగింది. జాతరలో భాగంగా మంగళవారం పోలేరమ్మ ఆలయం భక్తులు అంబలి పెట్టుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించే పీఠం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలో పిల్లలు ఇంటింటికీ వెళ్లి మడి బిక్షం సేకరించారు. రాత్రి పడమటి వీధిలోని అంకాళమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకున్నారు. సమీపంలో అమ్మ పుట్టినిల్లు కుమ్మరిమిట్టలో ఉన్న కుమ్మరి ఇంటి వద్ద మట్టితో చేసిన పోలేరమ్మ ప్రతిమను రహస్యంగా మెట్టినిల్లుగా పిలువబడే శెట్టిపల్లివారి వీధిలోని అలంకార గుడి వద్దకు తీసుకెళ్లి బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పోలేరమ్మ ప్రతిమను మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పూలతో అలంకరించిన పూల సప్పరంపై ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పట్టణంలో జాతరకు పెద్ద యాదవ్‌గా యాదపల్లి జనార్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవులు గంగపెట్టితో వీరాతాళ్ల ప్రదర్శనలతో పోలేరమ్మ ఆలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక మంగళవారం రాత్రి అమ్మవారికి సారె సమర్పించారు. జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

చెత్తతో సంపద సృష్టి

వెంకటగిరి (సైదాపురం): చెత్తతో ప్రతి పంచాయతీ సంపద సృష్టించుకోవాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ అన్నారు. సోమసానిగుంట, వల్లివేడు, పాలగొండ్లసత్రం గ్రామాల్లోని ఎస్‌బ్ల్యూపీసీ (సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్) షెడ్లను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పడేసిన చెత్త నుంచి సంపదను తయారు చేసుకుని గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని కోరారు. జిల్లా కో-ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా పనిచేస్తే ఆ పంచాయతీ నుంచే సంపదను తయారు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ కేవీ రమణయ్య, రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు వాకాడుకు నేదురుమల్లి

సైదాపురం: నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి బుధవారం వాకాడులోని తన నివాసంలో కార్యకర్తలకు ఉదయం 9గంటల నుంచి అందుబాటులో ఉంటారని వెంకటగిరి పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

దరఖాస్తుల ఆహ్వానం

కోట: మండలంలోని చిట్టేడులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శేషవర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది ఉత్తీర్ణులైన గిరిజన తెగకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 9441083367 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

































